క్లుప్తంగా

బాల్య మిత్రుడికి సాయం



అవనిగడ్డ: బాల్య మిత్రుడికి స్నేహితులు అండగా నిలిచారు. అవనిగడ్డ మండలం గుడివాక వారిపాలెం గ్రామానికి చెందిన బండే మాధవ రావు వ్యాపార రీత్యా హైదరాబాదులో స్థిరపడ్డారు. ఆయనకు అర్ధరాత్రి ఛాతి నొప్పి రావటంతో ఆసుపత్రికి వెళ్లారు. పరీక్షించిన వైద్యులు అత్యవసరంగా బైపాస్ సర్జరీ చేయాలని సూచించారు. దీంతో మాధవరావు ఆర్థిక పరిస్థితి అవగాహన కలిగిన ఆయన బాల్య మిత్రులు తమ చైల్డ్‌హుడ్ స్వచ్ఛంద సేవా సంస్థ వాట్సాప్ గ్రూప్ ద్వారా బాల్య మిత్రులు అందరూ కలిసి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని ఆదివారం మాధవరావుకు అందజేశారు. సంస్థ ఉపాధ్యక్షుడు మత్తి శ్రీనివాస రావు, కొండవీటి తులసీరావు ఈ సహాయాన్ని అందించి ధైర్యం చెప్పారు.

సుబ్బారాయుడి ఆలయంలో భక్తుల రద్దీ




మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగలిశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

236 మందికి వైద్యసేవలు



మచిలీపట్నంటౌన్: స్థానిక జీబీఆర్ ఫౌండేషన్, ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం బుట్టాయిపేటలోని జ్యోతిరావుపూలే విజ్ఞాన కేంద్రంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ గోపాలం శివన్నారాయణ 236 మంది రోగులకు వైద్యపరీక్షలు చేశారు. రోగులకు 200 రూపాయలకు రెండు నెలలకు సరిపడా మందులను అందించామని శిబిరం కన్వీనర్ పామర్తి నాగయ్య తెలిపారు. ఈ వైద్యశిబిరంలో వైద్యులు పి.సురేష్‌చంద్రా రెడ్డి, శంకరానంద్, మానసాదేవి కూడా రోగులకు వైద్యసేవలు అందించారు. తొలుత రోగులకు వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై శివన్నారాయణ అవగాహన కల్పించారు.

కొనసాగుతున్న అమ్మవారి గ్రామోత్సవం



కోడూరు: స్థానికంగా గంగా భవానీ అమ్మవారి గ్రామోత్సవం భక్తిప్రపత్తులతో కొనసాగుతోంది. ఆదివారం కోడూరు తూర్పు వైపు, స్వతంత్రపురం, ఎస్సీవాడల్లో చిన్నఅమ్మవారిని ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. ప్రతి ఇంటి వద్ద అమ్మవారి వాహనం ముందు నీటిని వారబోసి భక్తులు స్వాగతం పలుకుతున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీరలను సమర్పించి తమ భక్తిభావం చాటుతున్నారు. వీవర్స్‌కాలనీ, నరసింహపురం, కృష్ణాపురం, ఇస్మాయిల్‌బేగ్‌పేట, యర్రారెడ్డి వారిపాలెం గ్రామాల్లో కూడా అమ్మవారి గ్రామోత్సవం కొనసాగుతుందని ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు తెలిపారు. 10వ తేదీన ప్రధాన గుడిసంబరం నిర్వహించిన అనంతరం 11వ తేదీన చిన్నఅమ్మవారిని ఆలయ ప్రవేశం చేయించనున్నట్లు యుగంధరరావు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో షబ్ ఏ ఖదర్

గూడూరు: అత్యంత పవిత్రమైన రంజాన్ మాసంలో వచ్చే షబ్ ఏ ఖదర్ వేడుకలు శనివారం రాత్రి గూడూరు మండలంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. లైలతుల్ ఖదర్ వేడుకలను పురస్కరించుకుని మండలంలోని గూడూరు, ఆకులమన్నాడు, పినగూడూరులంక, మల్లవోలు, తరకటూరు, పోలవరం, షా అబ్దుల్లా పాలెం గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గూడూరులోని జామియా మసీదులో హాఫిజ్ షోయబ్ మొహమ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనలలో పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మసీదులను ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేశారు. రంజాన్ మాసం ప్రారంభం నుంచి మసీదుల్లో నిర్వహిస్తున్న తరావీ నమాజులలో ఖురాన్ పఠనం పూర్తయిన సందర్భంగా మత గురువులను ఘనంగా సత్కరించారు. అనంతరం భక్తులకు తబర్రుక్ పంపిణీ చేశారు.

చేనేతల అభ్యున్నతికి పెద్దపీట వేసిన సీఎం జగన్

పోలవరంలో ప్రజాదీవెన యాత్రలో ఉప్పాల రాము



కలంకారీ పరిశ్రమలో వస్త్రానికి అద్దకం చేస్తున్న ఉప్పాల రాము, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

గూడూరు: చేనేత కుటుంబాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము అన్నారు. ప్రజాదీవెన యాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని పోలవరం గ్రామంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రలో చేనేత కార్మికుల కష్టాలు చూసి చలించిపోయిన జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే నేతన్న నేస్తం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నేతన్నల ఆకలి చావులు ఆరికట్టడమే కాకుండా కార్మికులకు ఆర్థికంగా అండగా నిలవాలని విశాల హృదయంతో ఆలోచన చేసిన జగనన్న నేతన్న నేస్తం కార్యక్రమం ద్వారా మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి ఏడాదికి రూ.24 వేల ఆర్థిక సహాయం అందించారన్నారు. తద్వారా కార్మికులు ఆధునిక మగ్గాలు సమకూర్చుకోవడంతో పాటుగా పనిలేని రోజుల్లో పస్తులుండాల్సిన పరిస్థితి లేకుండా చేశామన్నారు. నేతన్నలకు 50 ఏళ్లకే పెన్షన్, నేతన్న కుటుంబాల్లో చదువుకునే చిన్నారులకు అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పథకాల ద్వారా ఆర్థికంగా తోడ్పాటు అందించినట్టు చెప్పారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు..

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా గ్రామంలోని అర్హులందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామని తెలిపారు. గృహనిర్మాణ రుణాలు కూడా మంజూరు చేశామన్నారు. వైఎస్సార్ జగనన్న కాలనీలో మెరక చేయడమే కాకుండా అంతర్గత రహదారులు, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశామని వివరించారు. రానున్న కాలంలో చేనేత కార్మికులకు మరింత అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. పెడన నియోజకవర్గంలోని కప్పలదొడ్డి, పోలవరం, పెడన ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన కలంకారీ పరిశ్రమకు కూడా తగిన తోడ్పాటు అందిస్తామన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలుకుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా సింహాద్రి చంద్రశేఖరరావును భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, మాజీ జెడ్పీటీసీ బూరగడ్డ శ్రీకుమార్, నాయకుడు పర్లం పెదబాబు, సర్పంచి నక్కిన నాగరాజు, గిరిజా తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేయాలి

నాగాయలంక: మండలంలోని పలు తీర గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలని అధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. వేసవి తీవ్రత కారణంగా కమ్మనమోలు గ్రామంలోని 14 గ్రామాల సామూహిక రక్షిత నీటి పథకం రిజర్వాయర్‌లలో నీటి నిల్వలు అడుగంటాయి. ఈ పథకం ద్వారా సరఫరా జరిగే పలు గ్రామాలకు నీరు అందక పోవడంతో ప్రజలు తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. నాలి, పాతఉపకాలి, దీనదయాళపురం తదితర గ్రామాల ప్రజలు తమకు తాగునీరు అందడం లేదని తక్షణం ట్యాంకర్లు ద్వారా తాగునీటిని అందించాలని విజ్ఞప్తి చేశారు. పంట కాల్వలకు విజయవాడలో నీటిని విడుదల చేసినందున నీరు చేరుకోగానే తొలి ప్రాధాన్యతా క్రమంలో కమ్మనమోలు రిజర్వాయర్‌లను నీటితో నింపుతామని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా ఎన్నికల కోడ్ దృష్ట్యా సంబంధిత అధికారుల అనుమతి కోరుతూ ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెప్పారు.

చర్చి ప్రార్థనల్లో పేర్ని కిట్టు



ఎల్ఈఎఫ్ చర్చిలో పేర్ని కిట్టుకు ఆశీర్వచనం అందిస్తున్న పాస్టర్ తంటిపూడి ప్రభాకరరావు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు చర్చిల్లో ఆదివారం జరిగిన ప్రార్థనల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలో ఆరు చర్చిలకు వెళ్లి ప్రార్థనల్లో పాల్గొనగా ఆయా చర్చిల పాస్టర్లు పేర్ని కిట్టుకు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు. రానున్న ఎన్నికల్లో పేర్ని కిట్టు విజయం సాధించాలని కోరుతూ పాస్టర్లు ఆశీర్వదించారు. ప్రార్థనలు చేసిన పాస్టర్లకు పేర్ని కిట్టు కృతజ్ఞతలు తెలిపారు. పేర్ని కిట్టు వెంట రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, కో ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకుడు బందెల థామస్‌నోబుల్, వైఎస్సార్ సీపీ క్రైస్తవ విభాగం జిల్లా నాయకురాలు అనుపమ ముఖర్జీ తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న పద్మారెడ్డి

గుడివాడ టౌన్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని వినియోగదారుల ఫోరం జిల్లా జడ్జి ఎన్. పద్మారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఏలూరు రోడ్‌లోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో విద్యాలయ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన పద్మారెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సేవలను వివరించారు. ప్రపంచ దేశాలకు ఆరోగ్య రక్షణ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు ఆర్గనైజేషన్ సూచనలిస్తుందన్నారు. ప్రజలను, ప్రభుత్వాలను అప్రమత్తం చేస్తుందన్నారు. విద్యార్థుల్లో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ఉండాలన్నారు. అప్పుడే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలుగుతారన్నారు. కార్యక్రమంలో విద్యాలయ హైస్కూల్ డైరెక్టర్ బొప్పన వెంకట విజయభాస్కర్, ఉమా హోమియో స్టోర్స్ అధినేత ఉమారెడ్డి పాల్గొన్నారు.

కనులపండువగా మల్లేశ్వరస్వామి కల్యాణం



శ్రీ మల్లేశ్వరస్వామి కల్యాణం జరుగుతున్న దృశ్యం

మండవల్లి: మండవల్లిలో కొలువైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో గూడూరు రామకృష్ణ యాజ్ఞికత్వంలో శ్రీ భ్రమరాంబదేవి, మల్లేశ్వరస్వామి కల్యాణం శనివారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుల వేదమంత్రోచ్చరణతో ఆలయప్రాంగణం మార్మోగింది. ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ, కార్యనిర్వహణాధికారి దివ్యశ్రీ కల్యాణ మహోత్సవాన్ని పర్యవేక్షించారు. అర్చకులుగా గూడూరు శ్రీనివాసరావు, నాగవెంకటశాస్త్రి, తేజనాగసాయికుమార్ వ్యవహరించారు. స్వస్తి వాచకులుగా ద్వాదశి కామేశ్వరశర్మ, ఫణికుమార్ శర్మ, హరి వెంకటసుబ్రహ్మణ్యం వ్యవహరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, మెంబా సురేష్ పాల్గొన్నారు.

కాలి నడకన భద్రాచలం బయలు దేరిన భక్తులు



జుఝవరం(పామర్రు): మండలంలోని జుఝవరం గ్రామానికి చెందిన 60 మంది భక్తులు కాలి నడకన గ్రామం నుంచి భద్రాచలానికి ఆదివారం బయలుదేరారు. ఈ నెల 17వ తేదీన భద్రాచలంలో జరిగే శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవంలో పాల్గొనేందుకు జుఝవరం నుంచి కాలినడకన బయలుదేరారు. మార్గ మధ్యంలో పెదమద్దాలి శివారు కొత్త పెదమద్దాలిలోని శ్రీ అభయాంజనేస్వామి ఆలయం వద్ద పాదయాత్ర భక్తులు కొలది సేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు పామర్రు కళా పరిషత్ అధ్యక్షుడు ఎన్ త్రివిక్రమరావు వితరణలో అల్పాహారం, ప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పామర్రు ప్రకండ అధ్యక్షుడు అరిగెల బాలుడు, మండల అధ్యక్షుడు నందిపు పాండురంగారావు, కళా పరిషత్ గౌరవాధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్, సమరసత కన్వీనర్ లక్ష్మణరావు, ప్రతినిధులు వెంకనారాయణ, వెంకటరత్నం, సుబ్బారావు, సుబ్రమణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరానగర్ కాలనీ పరిసర ప్రాంతాలలో పేదలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, ఇతర వ్యాధులకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు మెరుగుమాల శివరామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కోనా రామారావు, కోశాధికారి కె. రామకృష్ణ, జోనల్ చైర్‌పర్సన్ పి. సత్యన్నారాయణ, లింగం చిట్టిబాబు, పొన్నూరు రామకృష్ణ పాల్గొన్నారు.

రంజాన్ తోఫా అందజేత



చల్లపల్లి: రంజాన్ పండుగ సందర్భంగా పేదల ముస్లిలకు దాతల సహాయం అభినందనీయమని వైఎస్సార్ సీపీ జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి పఠాన్ కరిముల్లా ఖాన్ అన్నారు. ఆదివారం స్థానిక పడమరవైపు ఇస్లాంనగర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ ఆధ్వర్యంలో ముస్లింలకు నిత్యావసర సరుకులు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు మోపిదేవి వెంకటేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు అడపా గురవయ్య, అడపా రాంబాబుల ఆర్థిక సహకారంతో 50 మందికి రంజాన్ తోఫా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ పెద్దలు నర్రా సాయి, తగిరిశ సాంబశివరావు, రాయపాటి రాధాకృష్ణ, కస్తూరి ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ప్రజాదీవెన యాత్ర

గూడూరు: గూడూరు మండలం కప్పలదొడ్డి, ఆకులమన్నాడు గ్రామాల్లో సోమవారం ప్రజాదీవెన యాత్ర నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ గూడూరు మండల అధ్యక్షుడు పర్లం పెదబాబు తెలిపారు. ఉదయం 9 గంటలకు కప్పదొడ్డి నుంచి పార్టీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆయన వెల్లడించారు. పార్టీ శ్రేణులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

మసీదులో ఇఫ్తార్ విందు



మచిలీపట్నంటౌన్: నగరంలోని జవ్వారుపేట టిక్యా వద్ద ఉన్న మసీదులో ఆదివారం ముస్లింలు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రంజాన్ ఉపవాసదీక్ష ముగిసిన అనంతరం ముస్లిలు ఇఫ్తార్ విందులో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొని ముస్లిలతో పాటు ఇఫ్తార్ విందు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నాయకులు నజాఫ్‌అలీ, అన్వర్ హుస్సేన్, షేక్ మొహమ్మద్‌సాహెబ్, బాషు తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహ పునఃప్రతిష్ట

మండవల్లి: మండవల్లి సెంటర్‌లో బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహ పునః ప్రతిష్ట సోమవారం నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శాంతరాజు, గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, సీహెచ్ విజయ్, మెండా సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షత వహించనున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న మజ్జిగ చలివేంద్రాలు



మచిలీపట్నంటౌన్: వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో నగరంలోని గొడుగుపేట సాయి డెకరేషన్స్ వద్ద నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రం ఆదివారం 6వ రోజు నిర్వహించారు. వేసవి దృష్ట్యా పాదచారులకోసం ఈ మజ్జిగ చలివేంద్రాన్ని మరో 40 రోజులు నిర్వహిస్తామని క్లబ్ ప్రతినిధి శ్రీకాకోళపు రేణుకారాణి తెలిపారు. కార్యక్రమంలో వేముల శిరీష, శ్రీకాకోళపు నరసింహగుప్తా, జిల్లా ఆర్యవైశ్య సంఘాల సమాఖ్య అధ్యక్షుడు వేముల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద..

నగరంలోని ఆజాద్‌రోడ్డులో ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఆదివారం పాదచారులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన రహదారిలో వెళ్లే పాదచారులకు ఆలయ నిర్వాహకులు మజ్జిగ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి ఎంవీ బాబాప్రసాద్, కమిటీ ప్రతినిధులు కాంతారావు, హయగ్రీవరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన కోడూరు–అవనిగడ్డ రోడ్డు నిర్మాణం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- పార్టీ నేతలతో కలిసి నిర్మాణ పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్

కోడూరు: కోడూరు–అవనిగడ్డ ప్రధాన రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఆదివారం పార్టీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, యువ నేత సింహాద్రి వికాస్‌తో కలిసి రూ.16.80 కోట్లతో చేపడుతున్న రహదారి నిర్మాణ పనులను రమేష్‌బాబు పరిశీలించారు. కొత్తపేట–రామచంద్రాపురం, మాచవరం–వి.కొత్తపాలెం, వి.కొత్తపాలెం–జయపురం గ్రామాల మధ్య లెవలింగ్ పనులు తుది దశకు చేరుకున్నాయని రమేష్‌బాబు చెప్పారు. లెవలింగ్ అయిన ప్రాంతంలో వాటరింగ్, రోలింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. రహదారిని పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్మిస్తున్నామని తెలిపారు. నిర్మాణానికి వినియోగించే యంత్ర పరికరాలు సామర్థ్యం గురించి అక్కడ ఉన్న సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవనిగడ్డ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేశామని చెప్పడానికి గర్వంగా ఉందని రమేష్‌బాబు తెలిపారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు తెలిపి, తనను ఎమ్మెల్యేగా, సింహాద్రి చంద్రశేఖరరావును ఎంపీగా, జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. జెడ్పీటీసీలు, పార్టీల మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

ఐవీఎం సేవలు ప్రశంసనీయం



వీల్ చైర్, కుట్టు మిషన్లు, సైకిల్ అందిస్తున్న రాజేంద్ర బాబు, డాక్టర్ సురేష్

చల్లపల్లి: నిరుపేదల అవసరాలు గుర్తించి ఐవీఎం సురేష్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని విశ్రాంత డీఎస్పీ కె.హరి రాజేంద్రబాబు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పురిటిగడ్డలో ఉన్న ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ ఆర్థిక సహకారంతో పేదలకు సహాయం అందించారు. రూ.లక్ష వ్యయంతో చల్లపల్లికి చెందిన దివ్యాంగ విద్యార్థికి వీల్‌చైర్, పాత నడకుదురు, పురిటిగడ్డ, చల్లపల్లికి చెందిన ముగ్గురు మహిళలకు మూడు కుట్టు మిషన్లు అందజేశారు. పాత నడకుదురుకు చెందిన విద్యార్థినికి సైకిల్, ఐదుగురు పాస్టర్లకు ఎయిర్ కూలర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత ఐవీఎం సురేష్ సేవలను రాజేంద్రబాబు అభినందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వేములపల్లి రోజా, విజయ, స్విటిన్ రాస్, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నను గెలిపిస్తేనే సంక్షేమం

యువనేత సింహాద్రి వికాస్‌బాబు



సింహాద్రి వికాస్‌బాబుకు సీసీ రోడ్డును చూపిస్తున్న గ్రామస్తులు

ఉత్తరపాలెం(మోపిదేవి): జననేత జగనన్నను మరోసారి గెలిపించి అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగించేలా సహకరించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తనయుడు యువనేత సింహాద్రి వికాస్‌బాబు కోరారు. మండల పరిధిలోని ఉత్తరపాలెం ఎస్సీ ఏరియాలో ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ కన్వీనర్ మత్తి వెంకట రాజాచంద్ ఆధ్వర్యంలో యువత, మహిళలు అపూర్వ స్వాగతం పలికారు. దారిపొడవున పూల వర్షం కురిపిస్తూ డప్పు కళాకారులు, బాణాసంచా సందడితో ఊరేగింపుగా గ్రామానికి తీసుకువచ్చారు. తొలుత మారెమ్మతల్లి, పోతురాజుస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధాన సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.

రూ.7 లక్షలతో సీసీ రోడ్డు..

ఇటీవల అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.7 లక్షలతో 118 అడుగుల సీసీ రోడ్డును నిర్మించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా శ్మశానవాటికకు వెళ్లే రోడ్డును ఎవరూ పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వంలో ఎమ్మెల్యే రమేష్‌బాబు వెంటనే స్పందించి ఈ రోడ్డును పూర్తి చేశారని ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. మండల పార్టీ కన్వీనర్ గరికపాటి వెంకటేశ్వరావు, చోడాబత్తిన పూర్ణచంద్రరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ తుటారం కృష్ణ, దుట్టా అశ్విని కుమార్, మాజీ సర్పంచ్ పాలిమెట్ల వెంకటేశ్వరావు, మత్తి రాంప్రసాద్, జంపాన రాంబాబు, పాలిమెట్ల చంటి, పూషడపు వెంకటేశ్వరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెదఎత్తున మహిళలు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో విస్తృతంగా తనిఖీలు



నున్న చెక్ పోస్టులో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ దుర్గాప్రసాద్, సిబ్బంది

నున్న(విజయవాడరూరల్): గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. కార్లు, వ్యానులు, బైక్‌లను సైతం తనిఖీ చేస్తున్నారు. పవర్‌గ్రిడ్ వద్ద, కండ్రిక భవానీబార్ వద్ద, పైపులరోడ్డు వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. గత వారం చేసిన తనిఖీల్లో రూ.37లక్షలు నగదు పట్టుకున్నారు. అలానే ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొస్తున్న మద్యం బాటిళ్లను సైతం సీజ్ చేశామని సీఐ దుర్గా ప్రసాద్ చెప్పారు. చెక్‌పోస్టుల్లో రేయింబవళ్లు వాహనాలు తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. నున్న పవర్ గ్రిడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఏలూరు జిల్లా, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలతో పాటు విజయవాడ ఆటోనగర్, గుణదల ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. పైపులరోడ్డు జంక్షన్ వద్ద హైదరాబాద్ నుంచి విజయవాడ, నూజివీడు రాకపోకలు సాగించే వాహనాలు సోదా చేస్తున్నామన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న మానవత సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్ : ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఇతోధికంగా సాయం అందిస్తుందని ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. తిమ్మనవీడుకు చెందిన వీసం మహేష్ వీఐటీ అమరావతి క్యాంపస్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆర్థిక స్థోమత లేకపోవటంతో ఫీజు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతూ మానవత సంస్థను ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో వీసం మహేష్‌కు రూ.17 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం పంపిణీ చేశారు. భవిష్యత్‌లోనూ తనవంతు సాయాన్ని అందిస్తామని మానవత సభ్యులు భరోసా ఇచ్చారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కల్లేపల్లి నారాయణరావు, సీనియర్ సభ్యులు బాణాల నరసింహారావు, నారగాని కొండలరావు, వడ్డి రాజేశ్వరరావు పాల్గొన్నారు.